
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



'రెయిన్ గేజ్' బ్యూటీ

ప్రకృతి అందాలకు నిలయం ధారకొండ ఘాట్‌లోని రెయిన్ గేజ్ ప్రాంతం. ఇక్కడ నిత్యం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. 8లో



ముగిసిన వారోత్సవాలు

మావోయిస్టు పార్టీ అమరవీరుల వారోత్సవాలు గురువారంతో ఏవోబీలో ప్రశాంతంగా ముగిశాయి. 8లో



8న కంటి శస్త్ర చికిత్సలు

దీర్ఘకాలిక కంటి సమస్యలున్న వారికి పాడేరు ఐటీడీఏ సహకారంతో 8న విశాఖపట్నంలో శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నారు. 8లో

న్యూస్‌రీల్

6న సత్యదేవుని సామూహిక వ్రతాలు

అడ్డతీగల: స్థానిక సాయి సన్నిధి ఫంక్షన్ హాల్‌లో ఈనెల 6వ తేదీ ఆదివారం ఉదయం 9 తొమ్మిది గంటలకు అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామి వారి సామూహిక ఉచిత వ్రతాలు నిర్వహించనున్నట్టు పవనగిరి క్షేత్ర వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఈ వ్రతాలకు పూజాద్రవ్యాలు, ప్రసాదం అన్నవరం దేవస్థాన అధికారులు ఏర్పాటుచేస్తున్నట్టు ఆయన తెలిపారు. భక్తులు ఎటువంటి రుసుం చెల్లించవలసిన అవసరం లేదన్నారు. వ్రతాల్లో పాల్గొనదలచుకుంటే దంపతుల పేర్లు, గోత్రాలు, మొబైల్ నంబరు, ఆధార్ జెరాక్స్ కాపీ తప్పనిసరిగా పవనగిరి దేవస్థానంలో ఈనెల 5 లోపు అందజేసి రశీదు పొందాలన్నారు. దీనిని వ్రత సమయంలో దేవస్థానం అధికారులకు తప్పనిసరిగా చూపించాలని ఆయన కోరారు.

91.54 శాతం మేర పింఛన్ల పంపిణీ

సాక్షి, పాడేరు: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జిల్లాలో చురుగ్గా జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా 1,22,768 మంది సామాజిక పింఛనుదారులు ఉండగా, గురువారం సాయంత్రానికి 1,12,379 మందికి పంపిణీ చేయగా 91.54శాతం నమోదైంది.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రంపచోడవరం: గిరిజన సంక్షేమ శాఖ గురుకులం సెల్ తాడేపల్లి ఆదేశాల ప్రకారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ముసురుమిల్లి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు డీడీ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లా నుంచి ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 7, 8 తేదీల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ఆశ్రమ, గురుకుల పాఠశాలలో చదివిన వారు ఆరో తరగతి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి అర్హులన్నారు. అలాగే 7,8,9 తరగతుల్లో స్పోర్ట్స్ స్కూలులో ప్రవేశానికి బ్యాక్‌లాగ్ ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌లో ఐదో తరగతి 30 సీట్లు, ఏడవ తరగతి 30 సీట్లు, ఎనిమిదో తరగతి 30, తొమ్మిదో తరగతి 25 మొత్తం 125 సీట్లు ఉన్నట్లు తెలిపారు.

క్లాప్ మిత్రల సమస్యల పరిష్కారానికి వినతి



వైవీ సుబ్బారెడ్డిని కలిసిన శోభ సోమేశ్వరి

అనంతగిరి: ఏజెన్సీ 11 మండలాల్లో క్లాప్‌మిత్రల సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టాలని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని గురువారం కోరినట్టు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి గురువారం తెలిపారు. విశాఖపట్నంలోని ఆయనను విశాఖ ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి సమక్షంలోని మర్యాదపూర్వకంగా కలిశామని ఆమె వివరించారు. క్లాప్ మిత్రలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లించేలా కృషి చేయాలని వినతిపత్రం అందజేశామన్నారు.

కొనసాగుతున్న జెన్‌కో ఉద్యోగుల దీక్షలు



రిలే దీక్షలో పాల్గొన్న జెన్‌కో ఉద్యోగులు

సీలేరు: ఏపీ జెన్‌కో విద్యుత్ కాంప్లెక్స్ పరిధిలోని సీలేరు, డొంకరాయి, మోతుగూడెం వంటి విద్యుత్ కేంద్రాల్లో ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు రెండోవరోజు కొనసాగాయి. రాష్ట్ర విద్యుత్ జేఏసీ పిలుపు మేరకు.. గురువారం దీక్ష శిబిరంలోని మహిళ ఉద్యోగుల సైతం దీక్షలో పాల్గొని, తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గతేడాది పీఆర్సీ, మూడు డీఏల బకాయిలను వెంటనే చెల్లించాలని, అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు జెన్‌కో నుంచే నేరుగా జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలోని జెన్‌కో ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

- స్వచ్ఛందంగా మూతపడిన దుకాణాలు
- నిలిచిపోయిన ప్రైవేట్ సర్వీసులు
- డిపోకు పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- 'మణిపూర్' ఘటనలను నిరసిస్తూ పాడేరులో పాత బస్టాండ్ వరకు ప్రదర్శన



పాడేరు పాత బస్టాండ్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఆదివాసీ అఖిలపక్ష నాయకులు

పాడేరు రూరల్ : మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ తెగలపై జరుగుతున్న దాడులు, హత్యలు, హింసా కాండను వ్యతిరేకిస్తూ ఆదివాసీ అఖిలపక్ష నాయకులు గురువారం చేపట్టిన రాష్ట్ర మన్యం బంద్ జిల్లా కేంద్రమైన పాడేరులో విజయవంతమైంది. అఖిలపక్ష నేతలు ఐదు రోజుల క్రితమే బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి పట్టణంలో దుకాణాలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు మూసివేశారు.

- ఆర్టీసీ బస్సులను నిలిపివేయడంతో డిపోకు పరిమితమయ్యాయి. ప్రైవేట్ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఒకపక్క వర్షం కురుస్తున్నా అఖిలపక్ష నాయకులు, గిరిజన సంఘాల, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు సంపూర్ణంగా సాగింది.
- పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రధాన రహదారి నుంచి సినిమాహల్ సెంటర్ మీదుగా పాత బస్టాండ్ వరకు ప్రదర్శన చేపట్టారు. పాత బస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రసంగించారు.

ప్రధాని క్షమాపణ చెప్పాలి: గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స

మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలకు సంబంధించి దేశ ప్రధాని నరేంద్ర మోదీ అక్కడి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి. అప్పలనర్స డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీలకు రక్షణ కల్పించాలని, దాడులు, హింసా కాండను తక్షణమే ఆపాలన్నారు. కేవలం మతోన్మాదంతోనే ఆదివాసీలపై దాడులకు తెగబడుతున్నారన్నారు. ఆదివాసీలకు రక్షణగా ఉన్న అటవీ సంరక్షణ చట్ట పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. జీవో నంబరు 3కు చట్టబద్ధత కల్పించి గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్ని స్థానిక గిరి యువతతో భర్తీ చేయాలన్నారు.

ఐక్యపోరాటం అవసరం: ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర

ఆదివాసీల మనుగడ కోసం ఆదివాసీలంత ఒకే తాటిపైకి వచ్చి ఐక్యంగా పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర అన్నారు. గిరిజనం ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

- బంద్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పాడేరు పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్నపడాల్, జిల్లా నాయకులు సుందరరావు, సత్యనారాయణ, దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు భీమలమ్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ రాజశేఖర్, పాస్టర్ల సంఘ ప్రతినిధులు డేవిడ్‌రాజు, దైవకృప, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రంపచోడవరం సెంటర్‌లో మానవహారం

మూతపడిన బొర్రా గుహలు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలను మధ్యాహ్నం ఒంటిగంట తరువాత తెరచుకుంది. మణిపూర్ ఘటన నేపథ్యంలోని గిరిజన సంఘం చేపట్టిన మన్యం బంద్‌కు బొర్రాగుహలను మధ్యాహ్నం వరకు మూసివేసి, సిబ్బంది మద్దతు తెలిపారు. పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని, మధ్యాహ్నం నుంచి గుహలను తెరిచారు.

రంపచోడవరం: ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో రంపచోడవరంలో గురువారం మన్యం బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ కార్యాలయాలు,విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. స్థానిక అంబేడ్కర్ సెంటరులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మానవహారం ఏర్పడి నిరసన తెలిపారు. గిరిజన హక్కులు, చట్టాలు పరిరక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బంద్‌కు అధికారులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు మాట్లాడుతూ మణిపూర్‌లో మారణహోమం వెంటనే ఆపాలని,జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన అటవీ సంరక్షణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



పాడేరు పట్టణంలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి



పాడేరులో ఆర్టీసీ డిపోకు పరిమితమైన బస్సులు



మధ్యాహ్నం వరకు మూతపడిన బొర్రా గుహలు

వరద బాధితులకు రూ.5.20 కోట్ల సాయం

చింతూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విలీన మండలాల్లోని వరద బాధితులకు రూ 5.20 కోట్ల ఆర్థికసాయాన్ని అధికారులు గురువారం పంపిణీ చేశారు. ఇటీవల వచ్చిన వరదలకు చింతూరు, కూనవరం, వీఆర్‌పురం ఎటపాక మండలాల్లో 26,032 కుటుంబాలు ప్రభావితమయ్యాయి. వరద బారినపడిన ప్రతి కుటుంబానికి రూ.2 వేల ఆర్థికసాయం అందించాలని, ఇళ్లు దెబ్బతింటే రూ.10 వేలు ఇవ్వాలని ఇటీవల ముఖ్యమంత్రి వరద ప్రభావిత ప్రాంతాల అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీనిలో భాగంగా వీఆర్‌పురం మండలంలో 9,300 కుటుంబాలకు రూ.1.86 కోట్లు, కూనవరం మండలంలో 9,103 కుటుంబాలకు రూ 1.82 కోట్లు, చింతూరు మండలంలో 5.608 కుటుంబాలకు రూ 1.12 కోట్లు, ఎటపాక మండలంలో 2,021 కుటుంబాలకు రూ 40.42 లక్షలు అందజేశారు.

రూ 2 వేల చొప్పున..

చింతూరు డివిజన్లోని ప్రతి వరద బాధిత కుటుంబానికి రూ.2 వేల చొప్పున ఆర్థికసాయం అందజేయడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన చింతూరు మండలం ఏజీకొడేరు, ఉలుమూరులో నగదు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు.



నగదు పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



కల్లేరులో ఆర్థికసాయం అందచేస్తున్న తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీవో వెంకటరత్నం

ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటాం

ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్

వీఆర్‌పురం: వరదల్లో నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ అన్నారు. మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, చింతరేగుపల్లి గ్రామాల్లో గురువారం వారు పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడారు. వడ్డిగూడెం సచివాలయం వద్ద బాధితులకు తక్షణ సహాయం రూ.2 వేలు, బియ్యం,నూనెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌పురం మండలంలో గుర్తించిన 9,300 బాధిత కుటుంబాల్లో ఒకొక్క కుటుంబానికి తక్షణ సాయం కింద రూ.2 వేల చొప్పున అందజేసినట్టు తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా తమ ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. అలాగే తొలి ప్రాధాన్యత గ్రామాల్లోని నిర్వాసితులకు తొలివిడతగా స్ట్రక్చర్ ప్యాకేజీ ఇచ్చేందుకు సంబంధిత అధికారులు కసరత్తు చేస్తున్నారన్నారు. వడ్డిగూడెం, చింతరేవుపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, తహసీల్దార్ ఎస్.శ్రీధర్,ఎంపీడీవో రత్నకుమారి, వైస్ ఎంపీపీ ముత్యాల గంగాభవాని, ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, సర్పంచ్‌లు సోడెం నరసమ్మ, పిట్టా రామారావు, సెక్రటరి స్వరూప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోడియం గోపాల్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలో ప్రతీ కుటుంబానికి రూ.రెండు వేలు వరదసాయం అందించాలని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ సూచించారు. మండల పరిధిలోని చూచిరేవులగూడెం పంచాయతీలో వరద బాధితులకు రూ.2 వేల తక్షణ సాయం అందజేశారు. మండలంలో 9,103 కుటుంబాలకు రూ.1.82 కోట్ల మేర తక్షణ వరదసాయం అందించినట్టు వారు పేర్కొన్నారు. సర్వేచేసి దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం అందజేస్తారని తెలిపారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జావిజయ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మేరుకులం డైరెక్టర్ డీగంగాధర్, మండల కన్వీనర్ ఆలూరి కోటేశ్వరరావు, చూచిరేవుల సర్పంచ్ తెల్లం నిరోషా, సొసైటీ అధ్యక్షుడు ఎన్ కొండలరావు,తహసీల్దార్ కె. అనసూయ, మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జాబాబు పాల్గొన్నారు.



వడ్డిగూడెంలో వరద బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

సీఎం పర్యటన వాయిదా

వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం జరగాల్సిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూనవరం మండల పర్యటన అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ గురువారం తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని వారు పేర్కొన్నారు.

మహిళ హత్యపై నోరు మెదపరేం?

జనసేన తీరుపై అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ధ్వజం

అరకులోయ టౌన్: జనసేన పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు మాదల శ్రీరామ్ మహిళను అతికిరాతకంగా హత్య చేస్తే ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్, నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ధ్వజమెత్తారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోటలోని చందన లాడ్జీలో గత నెల 24వ తేదన మహిళను అతి కిరాతకంగా అరకులోయ మండలం, ఇరగాయి పంచాయతీ ఉరుములు గ్రామానికి చెందిన జనసేన పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు మాదల శ్రీరామ్ హత్య చేశాడన్నారు. ఆమె నుంచి బంగారం, డబ్బులు దోచుకున్నట్టు పోలీసు దర్యాప్తులో వెల్లడైందన్నారు. అయినప్పటికీ ఈ విషయంలో ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సేవా భావంతో పనిచేస్తున్న గ్రామ వలంటీర్లపై విమర్శలు చేస్తున్న పవన్‌కల్యాణ్, ఆ పార్టీ నేతలు మాదల శ్రీరామ్ విషయంలో ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. గతంలో మాదల శ్రీరామ్ మొదటి భార్యను మంచానికి కట్టి కిరోసిన్ పోసి నిప్పంటించి అతి కిరాతకంగా హతమార్చాడని ఆరోపించారు. అంతేకాకుండా గిరిజన ప్రాంతంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ. లక్షలు వసూలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. శ్రీరామ్‌ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో జనసేనకు అడ్రస్ లేదని, కులపిచ్చి, నీతి మాలిన నాయకులను గిరిజనులు తిరస్కరిస్తారని ఆయన పేర్కొన్నారు.



పవన్‌కల్యాణ్‌తో శ్రీరామ్ ఫొటోను చూపిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

విద్య, ఆరోగ్యంపై దృష్టి

- చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే



విద్యార్థినులతో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్

కూనవరం: ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేకశ్రద్ధ వహించాలని చింతూరు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. గురువారం ఆయన రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలసి కూనవరంలో కస్తూర్బా ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థుల చదువు విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. మెనూ అమలు చేయాలని పీవో ఆదేశించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

కలెక్టర్ సుమిత్‌కుమార్

చింతూరు: వరదముంపు ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వరద ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలని సూచించారు. పారిశుధ్యం, తాగునీరు, రహదారుల మరమ్మతులపై దృష్టి సారించాలని, ప్రతి వరద బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం , నిత్యావసరాలు సరఫరా చేయాలని ఆయన ఆదేశించారు. నాలుగు మండలాల్లో వరద సహాయక చర్యలు పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి

- మన్యంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు
- పెదబయలు, ముంచంగిపుట్టులో ఈదురుగాలుల బీభత్సం
- కూలిన చెట్లు, ఒరిగిన విద్యుత్ స్తంభాలు



మత్స్యగెడ్డ ఉధృతికి ధ్వంసమైన బొక్కెళ్లు కాజ్‌వే



జోలాపుట్టులో రహదారిపై కూలిన చెట్లు

సాక్షి,పాడేరు: జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి మన్యంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది. మత్స్యగెడ్డ గురువారం సాయంత్రం శాంతించినప్పటికి పాడేరు మండలంలోని బొక్కెళ్ల కాజ్‌వే దెబ్బతినడంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పెదబయలు మండలం పరదానిపుట్టు కాజ్‌వేకు వరద ఉధృతి తగ్గడంతో వాహన రాకపోకలు జరుగుతున్నాయి.

జిల్లాలో 139.6 ఎంఎం వర్షం

జిల్లా వ్యాప్తంగా గురువారం 139.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టులో 20.6 ఎంఎం, అత్యల్పంగా రంపచోడవరంలో 1ఎంఎం వర్షపాతం నమోదైంది. పెదబయలులో 16.8, జి.మాడుగులలో 14.6, జి.కే.వీధిలో 14.2, డుంబ్రిగుడలో 12.2, అరకులోయలో 11.4, వై.రామవరంలో 11.4, పాడేరులో 10.2, హుకుంపేటలో 9.2, చింతపల్లిలో 8.6, కొయ్యూరులో 3.2, అనంతగిరిలో 2.8, వీఆర్‌పురంలో 1.8, మారేడుమిల్లిలో 1.6 ఎంఎం వర్షపాతం నమోదైంది.

పెదబయలు: వర్షంతో కూడిన ఈదురుగాలులకు మండలంలోని వనభంగి ప్రాథమిక పాఠశాల పైకప్పు రేకులు మంగళవారం రాత్రి ధ్వంసమయ్యాయి.

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

ముంచంగిపుట్టు: ఆంధ్రా– ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో గురువారం ఉదయం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. జోలాపుట్టు జెడ్పీ పాఠశాల సమీపంలో ఉన్న రెండు భారీ వృక్షాలు ఆర్‌అండ్‌బీ రహదారికి అడ్డంగా పడ్డాయి.చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. దీంతో మంటలు రావడంతో దీనిని గమనించిన స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. వాహనచోదకులు, జోలాపుట్టు గ్రామస్తులు ఎట్టకేలకు రోడ్డుకడ్డంగా ఉన్న వృక్షాలను తొలగించారు. విద్యుత్ సిబ్బంది సరఫరాను పునరుద్ధరించారు. బుంగాపుట్టు, రంగబయలు, భూసిపుట్టు, లక్ష్మీపురం పంచాయతీల్లో వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. రాకపోకలకు గిరిజనులు అవస్థలు పడుతున్నారు.ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే మార్గంలో 33 కేవీ విద్యుత్ లైన్‌పై సైతం పలు చోట్ల చెట్టు కొమ్మలు పడిపోవడంతో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.రెండు మండలాల విద్యుత్ శాఖ అధికారులు శ్రమించి సరఫరా పునరుద్ధరించారు.

క్లుప్తంగా

వైఎస్ విగ్రహం ధ్వంసం



చోడవరంలో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన వైఎస్ విగ్రహం

ఎటపాక: మండలంలోని చోడవరం ప్రధాన సెంటర్లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు ఎలమోలు రమేష్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని రెండేళ్ల క్రితం ఏర్పాటుచేశారు. జాతీయరహదారి పక్కనే ఉన్న విగ్రహం తలపై బండరాళ్లతో కొట్టి పగులగొట్టడంతో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున కావాలనే ప్రతిపక్ష పార్టీలు ఈదుశ్చర్యకు పాల్పడ్డాయని రమేష్ ఆరోపించారు. ఈ ఘటనకు బాధ్యులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

8న ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

చింతపల్లిరూరల్: దీర్ఘకాలిక కంటి సమస్యలున్న వారికి పాడేరు ఐటీడీఏ సహకారంతో ఈనెల 8న విశాఖపట్నంలో శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్టు దృష్టి ఐ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గాలి జగన్ చెప్పారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లిలోని ఏరియా ఆస్పత్రిలో ఉచితంగా కంటి చికిత్సలు నిర్వహించి, దీర్ఘకాలిక సమస్యలు ఉన్న వారిని విశాఖపట్నానికి రిఫర్ చేస్తామన్నారు. కంటి సమస్యలున్నవారు 8వ తేదీకి ముందుగా ఆస్పత్రిని సందర్శించి పరీక్షలు చేయించుకొని, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. పరీక్షలకు ఈహెచ్‌ఎస్, ఈఎస్‌ఐ, ఆరోగ్యశ్రీ, తెల్ల రేషన్‌కార్డు కలిగిన వారు అర్హులన్నారు. రోగులకు ఉచిత రవాణా, భోజన వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 7013407421 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

హౌరా మెయిల్ రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: చెన్నైలో గురువారం రాత్రి 7.20 గంటలకు బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్– హౌరా(12840) మెయిల్ సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 11.45గంటలకు బయల్దేరింది. అంతే ఆలస్యంగా ఈ రైలు పలు స్టేషన్‌లకు చేరుకోనుంది.

‘లంపీస్కిన్’కు అడ్డుకట్ట

- అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా 1,49,100 లంపీస్కిన్ డోసులు సిద్ధం
- ఆర్బీకేల ద్వారా 1,48,100 డోసుల టీకాలు సరఫరా
- ఆగస్టు నెలాఖరుకు టీకాలు పూర్తి చేయడమే లక్ష్యం

సాక్షి, అనకాపల్లి: పాడి రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లు, పశువులకు సంచార అంబులెన్స్‌లను ఏర్పాటు చేసింది. పాడి రైతుకు మరింత ఆసరాగా నిలిచేందుకు ముందస్తుగా లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలను వేస్తోంది. గతేడాది ఆగస్టు–సెప్టెంబర్ మధ్యలో లంపీస్కిన్ వ్యాధితో దేశ వ్యాప్తంగా చాలా పశువులు మృత్యువాత పడ్డాయి. దీంతో ఏపీ ప్రభుత్వం ఈసారి అప్రమత్తమైంది.

ముందుగానే వ్యాక్సిన్లు : నెల రోజుల ముందుగానే పశువులు లంపీస్కిన్ వైరస్ బారిన పడకుండా పశు సంవర్ధక శాఖ టీకాల కార్యక్రమం ప్రారంభించింది. ఆగస్టు 1 నుంచి 31 వరకూ ప్రతీ ఆర్బీకే పరిధిలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి పాడి రైతుల వద్దకే వెళ్లి పశువులకు టీకాలు వేస్తున్నారు. అగ్రి అసిస్టెంట్ పర్యవేక్షణలో ప్రధానంగా తెల్లజాతి పశువులను గుర్తించి ముందుగా వ్యాక్సిన్‌లు వేస్తున్నారు. జిల్లాలో దేవరాపల్లి, మాడుగుల మండలాల్లో స్వల్పంగా లంపీస్కిన్ వైరస్ ప్రభావం ఉంది. లంపీ స్కిన్ వ్యాధి కారక క్యాప్రిపాక్స్ వైరస్ ఎక్కువగా తెల్ల జాతి ఆవులు, ఎద్దులలో వ్యాపిస్తోంది. ఇది రక్తాన్ని పీల్చే దోమలు, ఇతర కీటకాల ద్వారా ఒక జంతువు నుంచి మరో జంతువుకు సంక్రమిస్తోంది.

1,49,100 డోసులు సిద్ధం : జిల్లాలో మొత్తం లక్షా 85 వేల పశువులున్నట్లు పశు సంవర్ధక శాఖ అధికారులు గుర్తించారు. తొలి విడతలో గతేడాది సెప్టెంబర్‌లో 25 వేల వ్యాక్సిన్లు వేశారు. ఈ ఏడాది లంపీస్కిన్ వ్యాధి సీజన్‌కు నెల ముందుగానే జిల్లా వ్యాప్తంగా లక్షా 49 వేల 100 టీకా డోసులు సిద్ధం చేశారు. ఇప్పటికే వీటిలో లక్షా 48 వేల 100 డోసులను ఆర్బీకేలకు సరఫరా చేశారు.

లక్షణాలు ఇవే.. : వైరస్ సోకిన దాదాపు ఒక వారం తర్వాత జ్వరం వస్తుంది. ఈ జ్వరం 41 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువగా ఉండవచ్చు. వారం పాటు జ్వరం కొనసాగుతుంది. ఈ సమయంలో చర్మంపై బొడిపెలు విస్తరిస్తాయి. కళ్లవెంబడి నీరు కారుతూ ఉంటుంది. తీవ్రమైన నొప్పులు, చర్మం పెళుసుగా మారుతుంది. ఆ సమయంలో సరిగా మేత మేయలేవు. పాడి పశువులైతే పాలివ్వవు. బలవంతంగా పాలు తీయడం కూడా సరికాదు. లంపీస్కిన్ సోకిన పశువుల పాలను తాగడం కూడా ప్రమాదమే.



లంపీస్కిన్ వ్యాధి సోకిన పశువులు

పాడి రైతులకు అండగా ..



లంపీ స్కిన్ వ్యాధిని పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. గత ఏడాది ఆగస్టు– సెప్టెంబర్ నెలల్లో ఈ వ్యాధి తీవ్రతరమైంది. అప్పుడు జిల్లాలో 25 వేల వ్యాక్సిన్లు వేశాం. అప్పుడే మరో లక్షా 50 వేల వ్యాక్సిన్లు కావాలని అడిగాం. దీంతో ప్రభుత్వం ఈ ఏడాది నెల రోజులకు ముందుగానే లక్షా 49 వేల 100 లంపీస్కిన్ వ్యాక్సిన్లు ఇచ్చింది. ప్రతీ ఆర్బీకే పరిధిలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ ద్వారా ప్రతీ రైతు వద్దకు వెళ్లి తెల్లజాతి పశువులకు వ్యాక్సిన్లు వేసేలా నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్‌లను చేపట్టాం. పాడి రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోంది. – ప్రసాదరావు, పశు సంవర్ధక శాఖ జేడీ, అనకాపల్లి జిల్లా

‘రెయిన్ గేజ్’ బ్యూటీ



ఈ ప్రదేశం ఊటీ కాదు..కొడైకెనాల్ కానేకాదు. సిమ్లా అంతకన్నా కాదు. వేరే దేశమా.. అంటే అదీ కాదు. ఈ ప్రదేశం మరెక్కడో కాదు ధారాలమ్మ ఘాట్‌లోని సప్పర్ల వద్ద రెయిన్‌గేజ్ ప్రాంతం. మిట్ట మధ్యాహ్నం సైతం ఈ ప్రాంతంలో మంచు సోయగాలు కనువిందు చేస్తుంటాయి. సముద్ర మట్టానికి 1350 అడుగుల ఎత్తులో ఉన్నందున చల్లని వాతావరణం ఉంటుంది. ఈ ప్రాంతానికి మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన నేలగా గుర్తింపు ఉంది. 60 ఏళ్ల క్రితమే ఇక్కడ వర్షపాతాన్ని కొలిచేవారు. అందువల్లనే ఈ ప్రాంతాన్ని రెయిన్‌గేజ్‌గా పిలుస్తుంటారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఒక పక్క పచ్చదనం, మరోపక్క మంచు సోయగాలు మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఈ మార్గంలో వెళ్లే వారు ఈ ప్రాంతాన్ని తప్పనిసరిగా సందర్శించి మరపురాని అనుభూతిని పొందుతుంటారు. సుమారు 50 ఏళ్ల క్రితమే రెయిన్‌గేజ్ ప్రాంతాన్ని షూటింగ్‌లకు అనువుగా తెలుగు సినీ పరిశ్రమ గుర్తించింది. కల్యాణ మండపం (శోభనబాబు, కాంచన), అల్లూరి సీతారామరాజు (కృష్ణ), పెళ్లిచూపులు (చంద్రమోహన్, విజయశాంతి), కల్యాణమస్తు సినిమాల్లోని కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. – సీలేరు

ముగిసిన మావోయిస్టు వారోత్సవాలు

- వ్యూహాత్మకంగా పోలీసు బలగాలు
- ఏవోబీలో కానరాని జాడ



చిత్రాయిపుట్టు కల్వర్టు వద్ద తనిఖీ చేస్తున్న బలగాలు

సాక్షి,పాడేరు: మావోయిస్టు పార్టీ అమరవీరుల వారోత్సవాలు గురువారంతో ఏవోబీలో ప్రశాంతంగా ముగిశాయి. వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ ప్రకటించారు.అయితే ఆంధ్రా,ఒడిశా పోలీసు యంత్రాంగం మాత్రం ఏవోబీలో మావోయిస్టుల వారోత్సవాలను భగ్నం చేసే లక్ష్యంగా వ్యూహాత్మకంగానే వ్యవహరించింది. ముందస్తుగానే ఏవోబీ వ్యాప్తంగా పోలీసు బలగాలు గాలింపు చర్యలను చేపట్టాయి. ఏవోబీ వ్యాప్తంగా రెడ్ అలర్ట్‌ను పోలీసుశాఖ అమలుజేసింది. అన్ని పోలీసు స్టేషన్‌లతో పాటు అవుట్ పోస్టుల పరిధిలోను పోలీసు పార్టీలు తనిఖీలు చేపట్టాయి. వర్షాలు కురుస్తున్నప్పటికీ పోలీసు బలగాలు అడవిలో జల్లెడ పట్టాయి. మావోయిస్టుల అమరవీరుల వారోత్సవాల జాడ మాత్రం ఏవోబీలో ఎక్కడా కానరాలేదు.

పెదబయలు:మండలంలో మావోయిస్టుల అమరవీరులు వారోత్సవాల సందర్భంగా బుధవారం పోలీసు డాగ్ స్క్వాడ్‌తో ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేపట్టారు.మండలంలోని పెదబయలు, సీతగుంట, అడుగులపుట్టు మీదుగా కొత్తాపుట్టు, కుజభంగి రూడకోట, పెదబయలు నుంచి మంగబంద వరకు తనిఖీలు నిర్వహించారు.

గొడవకు దిగి .. మేడపై నుంచి జారి పడి..

- ప్రమాదవశాత్తూ మరణించిన రౌడీ షీటర్ షణ్ముఖ
- స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలో ఘటన



మృతుడు షణ్ముఖ కుమార్



షణ్ముఖ కుమార్ (ఫైల్)

గోపాలపట్నం: కల్యాణ మండపంలో స్నేహితుడి పుట్టిన రోజు వేడుక అనంతరం బాయ్‌తో జరిగిన గొడవతో ఆందోళన చెందిన రౌడీ షీటర్.. తప్పించుకునే క్రమంలో రెండో అంతస్తు నుంచి జారిపడి మృతి చెందాడు. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 నుంచి 3 గంటల మధ్య ఈ ఘటన చోటు చేసుకుంది. గోపాలపట్నం సీఐ ఈదుల నర్సింగరావు తెలిపిన వివరాలివీ.. గతంలో చినముషిడివాడలో నివాసం ఉండే జంపరంగు షణ్ముఖకుమార్(30) ఇటీవల తన స్వగ్రామమైన హుకుంపేట మండలం అడ్డుమండకు వెళ్లిపోయాడు. హైదరాబాద్‌లో స్నేహితుడు హేమంత్‌కుమార్ వద్ద ఉంటూ ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. కాగా.. బుధవారం బాజీ జంక్షన్‌కు చెందిన హేమంత్‌కుమార్ పుట్టిన రోజు. ఇటీవలే హేమంత్ విశాఖ రాగా.. పుట్టిన రోజు వేడుకలకు షణ్ముఖకుమార్ బుధవారం విశాఖ చేరుకున్నాడు. గోపాలపట్నంలోని కల్యాణ మండపంలో ఓ గది అద్దెకు తీసుకుని రాత్రి పుట్టిన వేడుకలు నిర్వహించారు. తర్వాత షణ్ముఖ, హేమంత్, నీరజ్ రఘుతో పాటు మరో ఇద్దరు మద్యం సేవించారు. ఆ సమయంలో కల్యాణ మండపం బాయ్‌తో వీరు గొడవపడ్డారు. అతనిపై చేయి చేసుకున్నారు. అనంతరం నగరానికి చెందిన రఘు, హేమంత్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరో ఇద్దరు షణ్ముఖ కోసం భోజనం తీసుకొచ్చారు. వీరు గదిలో ఉండగా బాయ్ బయటి నుంచి తలుపులు వేశాడు. దీంతో లోపల ఉన్న షణ్ముఖ ఆందోళనకు గురయ్యాడు. తనపై రౌడీషీట్ ఉందని, బాయ్ కేసు పెడితే ఇబ్బందులు పాలవుతానని లోలోన మదనపడ్డాడు. గదిలో ఉన్న బెడ్ సీట్‌ను రెండు ముక్కలు చేసి.. తాడులా తయారు చేశాడు. లాన్‌లో ఉన్న పిల్లర్‌కు బెడ్ షీట్ కట్టి కిందకు దిగేందుకు యత్నించారు. వద్దని స్నేహితులు వారించినా ఆగలేదు. పట్టు తప్పడంతో జారిపడ్డాడు. దిగువన రాళ్లు, గాజుపెంకులు ఉండడంతో తలకి, శరీరంలో పలు చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. గదిలో ఉన్న వారు ఈ విషయాన్ని సమీపంలోని స్నేహితులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని షణ్ముఖను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. సమాచారం అందుకున్న గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

షణ్ముఖ.. రౌడీషీటర్

షణ్ముఖ కుమార్‌పై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో 2015లో రౌడీషీట్ తెరిచారు. హత్య, హత్యాయత్నం, కిడ్నాప్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతను తన స్వగ్రామానికి వెళ్లిపోవడంతో రౌడీషీట్‌ను హుకుంపేట స్టేషన్‌కు బదిలీ చేశారు. షణ్ముఖ మెకానికల్ ఇంజినీరింగ్(డిప్లమో) పూర్తి చేశాడు. తన స్నేహితుడైన హేమంత్ ద్వారా ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. కొద్ది రోజులుగా హైదరాబాద్‌లో అతని వద్దే ఉంటున్నాడు. పుట్టినరోజు వేడుకలకు వచ్చి మృత్యువాత పడ్డాడు. ఎస్‌ఐ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

- మరో యువతికి తీవ్రగాయాలు
- మృతుడు అల్లూరి జిల్లా వాసి



మృతుడు శ్రీనివాసరెడ్డి (ఫైల్)



గాయపడిన అనిత

నక్కపల్లి/మారేడుమిల్లి : నక్కపల్లి మండలంలో జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాలివి పాడేరు జిల్లా రంపచోడవరం మండలం పెద్దగెద్దాడ పంచాయతీ పరిధిలోని చెరువుపాలెం గ్రామానికి చెందిన బోడిక శ్రీనివాస్ రెడ్డి (30) మారేడుమిల్లి మండలం గుజ్జుమామిడివలస గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన మరో యువతి సార్ల అనితతో కలసి విశాఖపట్నంలో డిపార్ట్‌మెంట్ పరీక్ష రాయడానికి మోటారు సైకిల్‌పై బయలు దేరారు. ఒడ్డిమెట్ట సమీపంలో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసరెడ్డి తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. బైక్‌పై వెనుక కూర్చొన్న యువతి అనితకు కుడి చేయి విరిగింది. ఆమెను108 వాహనంలో నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు. ఉపాధ్యాయుడి మృతి పట్ల గ్రామస్తులు, యూటీఎఫ్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో శిశువు మృతి



మృతి చెందిన శిశువు

హుకుంపేట: మండల కేంద్రంలోని అనారోగ్యంతో మూడు నెలల శిశువు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన సతక నానిబాబు, కుమారిల దంపతులకు చెందిన బాబు రెండు రోజుల నుంచి జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలతో బాధపడుతు గురువారం మృతి చెందాడు. బాబుకు రెండ్రోజుల నుంచి జ్వరం, జలుబు ఉన్నప్పటికీ తల్లితండ్రులకు అవగాహన లేక సమీపంలో ఆస్పత్రికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం చేయడంతో బాబు మృతి చెందినట్టు స్థానికులు తెలిపారు. వాతావరణలో మార్పుల నేపథ్యంలో రోగాలు ప్రబలకుండా సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడంతో పాటు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

5న ఐఐపీఈ 3వ స్నాతకోత్సవం



వివరాలు వెల్లడిస్తున్న డైరెక్టర్ శాలివాహన్

ఏయూక్యాంపస్: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ(ఐఐపీఈ) మూడవ స్నాతకోత్సవం ఈ నెల 5న నిర్వహిస్తున్నట్లు ఐఐపీఈ సంచాలకుడు ఆచార్య శాలివాహన్ తెలిపారు. కళాశాల ప్రాంగణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు ఉదయం 11.30 గంటల నుంచి నోవాటెల్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియోమాగ్నటిజం , ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ గౌరవ శాస్త్రవేత్త ఆచార్య అర్చన భట్టాచార్య ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. పెట్రోలియం ఇంజినీరింగ్‌లో 56 మంది, కెమికల్ ఇంజినీరింగ్‌లో 46 మంది విద్యార్థులు డిగ్రీలు స్వీకరిస్తారని వెల్లడించారు. ప్రతీ బ్యాచ్ నుంచి ఇద్దరికి వారి ప్రతిభ ఆధారంగా బంగారు, వెండి పతకాలను అందిస్తామన్నారు. సమగ్ర ప్రతిభను పరిశీలించి ఓ విద్యార్థికి ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్‌ను అందజేస్తామన్నారు.

ఈ ఏడాది రెండు కొత్త కోర్సులు

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి బి.టెక్ మెకానికల్ ఇంజినీరింగ్, అప్లయిడ్ జియాలజీ ఎమ్మెస్సీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ఆచార్య శాలివాహన్ తెలిపారు. ఆయిల్ ఇండియా లిమిటెడ్ సంస్థ రూ.1.25 కోట్ల పరిశోధన ప్రాజెక్టును అందించిందన్నారు. ఎన్టీపీసీకి కరోజన్ సంబంధిత పరిశోధన ప్రాజెక్టుకు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఎనర్జీ రంగం, పరిశ్రమలను అనుసంధానం చేయడం, విదేశీ భాగస్వామ్యం అనే మూడు అంశాలు ప్రధానంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. బాలికా విద్యను ప్రోత్సహించడానికి 10 మందికి ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నట్లు వివరించారు.

వంగలిలో శాశ్వత క్యాంపస్

ఐఐపీఈ శాశ్వత భవనాల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని ఆచార్య శాలివాహన్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఈ నెలాఖరుకు టెండర్లు ఖరారు చేస్తామన్నారు. సబ్బవరం దగ్గర వంగలిలో రూ.401 కోట్ల వ్యయంతో క్యాంపస్ నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో 96.47 శాతం మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని.. మిగిలిన వారు ఉన్నత విద్యకు ఆసక్తి చూపినట్లు తెలిపారు. తమ ఆచార్యులు 35 పరిశోధన పత్రాలను ప్రతిష్టాత్మక జర్నల్స్‌లో ప్రచురించారన్నారు. మొత్తం రూ.9.5 కోట్ల విలువైన 15 పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించామన్నారు. వివిధ విశ్వవిద్యాలయాలతో చేసుకుంటున్న అవగాహన ఒప్పందాలు, విద్యార్థులు సాధించిన విజయాలను వివరించారు. డీన్(రీసెర్చ్–డెవలప్‌మెంట్) ఆచార్య కె.విజయ్ కుమార్, డీన్(అకడమిక్స్) ఆచార్య దీపక్ అంబస్ మిశ్రా, రిజిస్ట్రార్ శ్రీ రాంపాల్ ద్వివేది పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో ముగ్గురికి రిమాండ్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన యువకుడి హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు రిమాండ్‌కు పంపించారు. తాటిచెట్లపాలెం బజారులోని బార్ అండ్ రెస్టారెంట్‌లో ఇటీవల కైలాసపురానికి చెందిన కిరణ్(22)ను కాపు శివ(నందిగిరినగర్), పి.శ్రీనివాస్(చెక్కుడురాయి బిల్డింగ్), రౌతు సురేష్(కైలాసపురం) హత్య చేశారు. ముగ్గురినీ అరెస్ట్ చేసిన పోలీసులు.. గురువారం రిమాండ్‌కు తరలించారు.

భారీ గిరినాగు ఖననం



ప్రధాన రహదారిపై చనిపోయిన గిరినాగును పరిశీలిస్తున్న డాక్టర్ తరుణ్

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి శివారు పండ్ల దుకాణం సమీపంలోని ఎన్‌హెచ్ 516 రహదారిపై గురువారం చనిపోయి ఉన్న గిరినాగు(కింగ్ కోబ్రా)ను స్థానికులు గమనించారు. సమాచారాన్ని అటవీ అధికారులకు ఇవ్వడంతో రేంజ్ అధికారి అబ్బాయిదొర వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఈ మార్గంలో వాహనం పాము మీదుగా వెళ్లడంతో మరణించి ఉంటుందని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ తరుణ్ పాముకు పోస్టుమార్టం చేశారు. చనిపోయిన గిరినాగుకు ఖననం చేసినట్టు అటవీ అధికారి తెలిపారు. సుమారు 5 సంవత్సరాల వయస్సు గల ఈ ఆడపాము సుమారు 10 అడుగుల పొడవు, 5 కిలోల బరువు ఉందని, వాహనం తొక్కడంతో ఈ భారీ సర్పం మరణించి ఉండవచ్చని డాక్టర్ తరుణ్ చెప్పారు.

శభాష్ వలంటీర్

- ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత
- 52 కిలోమీటర్ల ప్రయాణం చేసిన వలంటీర్



పాడేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ హేమలత

ముంచంగిపుట్టు: పాడేరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముంచంగిపుట్టు మండలంలోని సుజనకోట పంచాయతీ కొత్తసుజనకోట గ్రామానికి చెందిన రాణ మోతికి గ్రామ వలంటీర్ హేమలత గురువారం పింఛన్ అందజేసింది. కంటి సమస్యతో బాధపడుతూ వారం రోజుల నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రిలో మోతి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ హేమలత తన గ్రామం నుంచి 52 కిలోమీటర్లు దూరంలో ఉన్న పాడేరు ఏరియా ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారునికి ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్‌ను అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తనకు ఇంత దూరం వచ్చి పింఛన్ ఇవ్వడం పట్ల వృద్ధురాలు మోతి వలంటీర్ హేమలతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వలంటీర్ హేమలత చూపిన చొరవపై ఆ పంచాయతీ సర్పంచ్ వెంగడ రమేష్, మోతి కటుంబ సభ్యులు, స్థానికులు అభినందనలు తెలియజేశారు.

వసతి గృహాల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ కృష్ణన్



మాట్లాడుతున్న డైరెక్టర్ విజయ కృష్ణన్

ఏయూక్యాంపస్: సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో ఉండే విద్యార్థుల ఉత్తీర్ణత శాతాలు పెంచే దిశగా సంక్షేమ అధికారులు బాధ్యత తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. గురువారం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశమందిరంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల సంక్షేమ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ కృష్ణన్ మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. స్టడీ అవర్స్‌లో వారు ఏ విధంగా చదువుతున్నారో గమనించాలన్నారు. అవసరమైతే సంబంధిత సబ్జెక్ట్ టీచర్‌తో మాట్లాడి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హాస్టల్స్ నిర్వహణ మరింత పటిష్టంగా ఉండేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని తీర్చిదిద్దిన విధానం వివరించారు. సంక్షేమ అధికారులు ముందుగా ఎస్‌వోపీ చదివి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ డాక్యుమెంట్‌ను తెలుగులో కూడా తీసుకువస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ హాస్టల్స్‌లో ఈ ఏడాది సాధించిన ఉత్తీర్ణత వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన ఫలితాలు సాధించిన వసతిగృహాల సంక్షేమ అధికారులను అభినందించారు. జాయింట్ డైరెక్టర్ కె.రామారావు, అనకాపల్లి జిల్లా సంక్షేమ అధికారి అజయ్ బాబు, అధికారులు పాల్గొన్నారు.